

చీనీ టన్ను రూ.24 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.24 వేలు పలికాయి.



ఇద్దరు డీజిల్ దొంగల అరెస్ట్

లారీల్లో డీజిల్ అపహరించే ఇద్దరు దొంగలను యాడికి పోలీసులు సినీ ఫక్కీలో అరెస్ట్ చేశారు. వీరి నుంచి కారు, డీజిల్, నగదు స్వాధీనం చేసుకున్నారు. 10లో

గరిష్టం/కనిష్టం
37.3°/22.6°

జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

నేటి నుంచి దసరా సెలవులు



అనంతపురం ఎడ్యుకేషన్: అన్ని యాజమాన్యాల పాఠశాలలకు శనివారం నుంచి ఈ నెల 24 వరకు దసరా సెలవులు ప్రకటించారు. 25న పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి వి.నాగరాజు తెలిపారు. సెలవురోజుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యార్థులకు తరగతులు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ఎక్కడైనా ప్రత్యేక తరగతులు నిర్వహించినట్లు తెలిస్తే మాత్రం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే 'మనబడి నాడు–నేడు' పనులు జరుగుతున్న పాఠశాలలకు ఈ సెలవు దినాల్లో సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ మెటీరియల్ (సీపీఎం) వస్తే కచ్చితంగా రిసీవ్ చేసుకుని భద్రపరుచుకోవాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. మెటీరియల్ తీసుకోకుండా తిరస్కరిస్తే క్రమశిక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

'పాలవెల్లువ'తో రైతులకు లబ్ధి



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: 'జగనన్న పాలవెల్లువ' పథకం ద్వారా పాడి రైతులకు ఆర్థిక లబ్ధి చేకూర్చాలని ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. పాలవెల్లువ పథకం అమలుపై జేసీ శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ 'జగనన్న పాలవెల్లువ'లో భాగంగా అనంతపురం రూరల్, ఆత్మకూరు, బుక్కరాయసముద్రం, నార్పల, రాప్తాడు, యల్లనూరు మండలాల పరిధిలోని 56 రైతు భరోసా కేంద్రాలు, 114 గ్రామాల్లో 'అమూల్' పాల సేకరణ త్వరలో ప్రారంభమవుతుందన్నారు. ఇందుకు సంబంధించి ఆయా గ్రామాల్లో సర్వే నిర్వహించి పశువులు ఉన్నవారి జాబితా సేకరించాలని ఆదేశించారు. ఈ ప్రక్రియ వారం రోజుల్లో పూర్తి చేయాలని చెప్పారు. సమావేశంలో పశుసంవర్ధకశాఖ జేడీ సుబ్రమణ్యం, పీఆర్ ఎస్‌ఈ భాగ్యరాజ్, జిల్లా కో–ఆపరేటివ్ అధికారి ప్రభాకర్‌రెడ్డి, డెయిరీ మేనేజర్ నారాయణమ్మ, పశువైద్యుడు గోల్డ్‌మెన్, ఏఈలు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

జోరుగా 'ఆరోగ్య సురక్ష'

అనంతపురం మెడికల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారు. శుక్రవారం జిల్లాలోని 27 ప్రాంతాల్లో జరిగిన వైద్య శిబిరాలు నిర్వహించారు. 8110 మంది ప్రజలు ఓపీ సేవలు వినియోగించుకున్నారు. 54 మంది స్పెషలిస్టు వైద్యులు సమస్యలున్న 312 మందిని జిల్లా ఆస్పత్రి, ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. అందులో 1,577 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. నార్పల, రాప్తాడు ప్రాంతాల్లో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య క్యాంపులను డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబదేవి పరిశీలించారు. శని, ఆదివారాలు సెలవు దినాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు ఉండవని, ఈ నెల 16న క్యాంపులు యథావిధిగా ప్రారంభమవుతాయని డీఎంహెచ్‌ఓ తెలిపారు.

బంగారు నాణేల పేరుతో బురిడీ

- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు



అనంతపురం క్రైం: నకిలీ బంగారు నాణేలతో అమాయకులను బురిడీ కొట్టిస్తున్న ముఠాకు చెందిన ఇద్దరు సభ్యులను తెలంగాణ పోలీసులు అనంతపురంలో అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకెళితే.. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తికి అనంతపురంలోని బిందెలకాలనీకి చెందిన రవి, సురేంద్ర అనే వ్యక్తులు కూలీలుగా పరిచయమయ్యారు. తాము ఓ చోట పనిచేస్తుండగా బంగారు నాణేలు దొరికాయని, వాటిని తక్కువ ధరకు ఇస్తామని చెప్పారు. ఒక స్వచ్ఛమైన బంగారు నాణెం శాంపిల్‌గా ఇచ్చి నమ్మించారు. దీంతో తక్కువ ధరకు బంగారం కొనేందుకు హైదరాబాద్ వాసి సుముఖత వ్యక్తం చేశాడు. ఈ మేరకు ఇటీవల రూ.30లక్షలు ముట్టజెప్పాడు. అందుకు వారు కొన్ని నాణేలు ఇచ్చి అక్కడి నుంచి వచ్చేశారు. తర్వాత నిదానంగా నాణేలను పరిశీలించగా నకిలీవని తెలియడంతో నిలువునా మోసపోయానని బాధితుడు లబోదిబోమన్నాడు. అక్కడి పోలీసులను ఆశ్రయించి తను ఎలా మోసపోయిందీ వివరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు తెలంగాణ పోలీసులు శుక్రవారం అనంతపురం చేరుకున్నారు. నిందితులు రవి, సురేంద్రను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.20 లక్షల నగదు రికవరీ చేశారు.


మనసుకు మానని గాయం

ఆందోళన.. భయం.. ప్రజలను బెంబేలెత్తిస్తోంది. వీటికి తోడు సామాజిక మాధ్యమాల వినియోగమూ దుష్ప్రభావాలను చూపుతోంది. చదువు, ఉద్యోగాల్లో ఒత్తిడే కాదు మత్తుపదార్థాల వాడకం, ఒంటరి తనం వంటి వాటితో చాలామంది మానసిక జబ్బులకు గురవుతున్నారు.

- పల్లెలకూ విస్తరించిన మానసిక రుగ్మతలు
- పీహెచ్‌సీ స్థాయిలోనే భారీగా నమోదవుతున్న కేసులు
- 24 శాతం యాంగ్జైటీ ఫోబియా బాధితులే
- బుద్ధిమాంద్యం కేసులు 'అనంత' జిల్లాలోనే ఎక్కువ
- స్కిజోఫ్రీనియా, యాంగ్జైటీతో చాలామంది సతమతం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రకరకాల మానసిక జబ్బుల బాధితుల వివరాలు

జబ్బు	కేసుల శాతం
స్కిజోఫ్రీనియా	19.93
మూడ్ డిజార్డర్స్	26.28
సబ్‌స్టాన్స్ యూజ్ డిజార్డర్స్	15.46
ఆర్గానిక్ అండ్ డిమెన్షియా	9.82
యాంగ్జైటీ ఫోబిక్	24.53
మెంటల్ రిట్రాడియేషన్	3.98



- ఈ నెల 11న అనంతపురంలోని ఓ ప్రైవేట్ మానసిక వైద్యుడి వద్దకు వెళ్లిన ఓ మహిళకు ఉదయం 10.30 గంటలకే 67వ నంబరు టోకన్ వచ్చింది. దీన్ని బట్టి అక్కడ రోజువారీ వందమందికి పైగా ఓపీకి వస్తున్నట్లు తేలింది.
- అనంతపురం సర్వజన ఆస్పత్రిలో రోజూ 200 మంది దాకా మానసిక రోగులు ఔట్‌పేషెంట్ విభాగంలో చికిత్స పొందుతున్నారు. ఈ లెక్కన నెలకు సగటున 5వేల మంది దాకా రోగులు వస్తున్నట్లు తెలుస్తోంది.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్) జోడెద్దులా పల్లెల్లో సవారీ చేస్తుండగా.. ఇప్పుడు మానసిక రుగ్మతలూ వెంటాడుతున్నాయి. నిన్నా మొన్నటిదాకా పట్టణాలు, నగరాలకు మాత్రమే పరిమితమైన ఈ పోకడ తాజాగా గ్రామీణ ప్రాంతాలకూ తాకడం ప్రమాదకర సంకేతాలు ఇస్తున్నట్టే అని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవలి కాలంలో మానసిక ఇబ్బందులతో వస్తున్న వారు ఎక్కువయ్యారని జిల్లా మెంటల్ హెల్త్ ప్రోగ్రాం స్క్రీనింగ్ పరీక్షల్లో తేలింది. ఈ పరీక్షల్లో రకరకాల మానసిక రుగ్మతలతో ఇబ్బంది పడుతున్న వారు వేలాదిమంది ఉన్నట్టు బయటపడింది. స్కిజోఫ్రీనియా, డిప్రెషన్, మూడ్ డిజార్డర్స్ వంటి మానసిక జబ్బులతో సతమతమవుతున్నారు. సగటున చూస్తే పురుషుల్లోనే ఎక్కువ మంది బాధితులున్నట్టు వెల్లడైంది.

స్కిజోఫ్రీనియా..యాంగ్జైటీలే ఎక్కువగా..

స్కిజోఫ్రీనియా (మనో వైకల్యం), యాంగ్జైటీ (ఆందోళన) ఎక్కువ మందిలో ఉన్నాయి. ప్రతి దానికీ డీలా పడిపోవడం, ఏమవుతుందోనని భయం, ఆందోళన వంటి జబ్బులతో సతమతమవుతున్నారు. వైద్యుల వద్దకు చికిత్సకు వెళ్లాలంటే కూడా ఆత్మన్యూనతగా భావిస్తున్నారు. ఇలాంటి మానసిక వ్యాధులు దీర్ఘకాలికంగా ఉండటంతో వృత్తిపరంగానూ ఇబ్బందులు పడుతున్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు వెళ్లినప్పుడు బాధితుల జబ్బు తీవ్రత చూసి వైద్యులు ఆశ్చర్యపోతున్నారు. చిన్నారుల్లో వచ్చే బుద్ధిమాంద్యం కేసులు మిగతా జిల్లాలతో పోలిస్తే 'అనంత'లో ఎక్కువని తేలింది.

మానసిక రుగ్మతలకు ప్రధాన కారణాలు

- ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై చిన్నకుటుంబాలు రావడంతో వేధిస్తున్న ఒంటరితనం.
- ఆరు సంవత్సరాల వయసునుంచే సామాజిక మాధ్యమాల ప్రభావం ఎక్కువగా ఉండటం.
- మద్యం, ఇతర మత్తుపదార్థాల వినియోగంతో యువకుల్లో మానసిక రుగ్మతలు పెరగడం.
- ప్రైవేటు లేదా కార్పొరేట్ విద్యాసంస్థల్లో విపరీతమైన ఒత్తిడి.
- సాఫ్ట్‌వేర్, బ్యాంకింగ్ వంటి ఉద్యోగాల్లో పని ఒత్తిడి పెరగడం.
- వ్యాయామం లేకపోవడం వల్ల చిన్న వయసులోనే జీవనశైలి జబ్బులకు గురవడం.
- ఇటీవలి కాలంలో స్మార్ట్ ఫోన్‌ల ప్రభావంతో చిన్నారుల్లో మానసిక ఎదుగుదల సరిగా లేకపోవడం.

'ఆరోగ్య సురక్ష' క్యాంపుల్లో రుగ్మతలు వెలుగులోకి..

మండలాల వారీగా జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో నిర్వహిస్తున్న హెల్త్ క్యాంపుల్లోనూ మానసిక రుగ్మతలను వెలికి తీస్తున్నారు. జిల్లాలో వేలాదిమంది ఈ క్యాంపులకు వచ్చి తమ ఇబ్బందులను స్పెషలిస్టు వైద్యులకు తెలిపి చికిత్స చేయించుకుంటున్నారు. ఇలా మానసిక జబ్బులతో వస్తున్న వారిని అనంతపురంలోని సర్వజనాస్పత్రికి రెఫరల్‌గా పంపిస్తున్నారు.

పల్లెల్లోనూ మానసిక రుగ్మతలు



గతంతో పోల్చితే పల్లెల్లోనూ మానసిక రుగ్మతలు పెరిగాయి. ఆహార అలవాట్లు మారాయి. వ్యాయామం లేదు. రకరకాల మానసిక సమస్యలు పెరిగాయి. వీటిని ప్రాథమిక దశలో గుర్తిస్తే నియంత్రించవచ్చు. చాలా మంది తమకు మానసిక సమస్య ఉందని తెలిసీ చికిత్సకు రావడం లేదు. ఎవరికైనా మానసిక సమస్య ఉన్నప్పుడు పీహెచ్‌సీలకు రావాలి. వైద్యులను సంప్రదించాలి.

–డా.విశ్వనాథరెడ్డి, మానసిక వైద్య నిపుణులు, జిల్లా మెంటల్‌హెల్త్ ప్రోగ్రాం

పోలీసు శాఖలో ప్రక్షాళన

- వీఆర్‌కు తొమ్మిది మంది
- ఉత్తర్వులు జారీ చేసిన ఎస్పీ



అనంతపురం క్రైం: పోలీసు శాఖలో ప్రక్షాళన మొదలైంది. జిల్లాలో ప్రజల కష్టార్జితాన్ని పీల్చి పిప్పిచేసే మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారితో సత్సంబంధాలు కలిగిన పోలీసులపై ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. డీఎస్పీ స్థాయి అధికారితో విచారణ చేయించిన అనంతరం గుంతకల్లు, కళ్యాణదుర్గం పోలీసు సబ్‌డివిజన్ల పరిధిలో తొమ్మిది మంది పోలీసులపై వేటు వేశారు. ఈ మేరకు ఒక ఎస్‌ఐతో పాటు ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు, ఐదుగురు కానిస్టేబుళ్లను వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు జారీ చేశారు. తప్పు చేస్తే సొంత శాఖలోని సిబ్బందిని కూడా వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. నెలవారీ మామూళ్లు పెట్టుకుని అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించేవారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో మరికొంత మందిపై చర్యలకు రంగం సిద్ధం చేసినట్లు ఎస్పీ తెలిపారు. జిల్లాలో మట్కాతో పాటు పేకాట, బెట్టింగ్, మద్యం, ఇసుక అక్రమ రవాణాతో పాటు విక్రయాలకు సంబంధించిన సమాచారం నేరుగా తనకు లేదా 94407 96800 నంబరుకు కాల్ చేసినా, వాట్సాప్ ద్వారా మెసేజీ పంపినా తక్షణమే చర్యలు తీసుకుంటామని ప్రజలకు సూచించారు.

రోగులకు ఇబ్బందులుంటే ఫిర్యాదు చేయండి

అనంతపురం మెడికల్: జిల్లాలో 44 ప్రైవేట్, 50 ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా సేవలందిస్తున్నామని, రోగులకు ఏమైనా ఇబ్బందులుంటే 104 కాల్ సెంటర్‌తో పాటు తనకు వ్యక్తిగతంగా ఫిర్యాదు చేయవచ్చని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి సూచించారు. ఆరోగ్యశ్రీ కింద అడ్మిట్ అయిన లబ్ధిదారుల నుంచి డబ్బు వసూలు చేసిన తొమ్మిది ఆస్పత్రులకు రూ.14 లక్షల అపరాధ రుసుం విధించామన్నారు. రెండు ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ సేవలను తొలగించినట్లు తెలిపారు.

సెంట్రల్ వర్సిటీలో పనులు చేపట్టండి

- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం



కేంద్రీయ విశ్వవిద్యాలయం మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: కేంద్రీయ విశ్వవిద్యాలయం (సెంట్రల్ యూనివర్సిటీ)లో అభివృద్ధి పనులు త్వరితగతిన చేపట్టాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల అంశంపై కలెక్టర్ శుక్రవారం తన చాంబర్‌లో అధికారులతో సమీక్షించారు. విశ్వవిద్యాలయ మ్యాప్‌ను పరిశీలించి, అక్కడ చేపట్టాల్సిన పనుల వివరాలు, ఇప్పటి వరకు తీసుకున్న చర్యల గురించి ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ప్రహరీ నిర్మాణం సగంలోనే ఎందుకు నిలిచిపోయిందో కారణాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించుకుని మిగిలిన పనులు రెండు రోజుల్లో ప్రారంభించాలని ఆదేశించారు. యూనివర్సిటీలో 33 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అవసరమైన భూ సేకరణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

రెండు వరుసల రహదారి నిర్మించాలి

అనంతపురం– తాడిపత్రి హైవే నుంచి కేంద్రీయ విశ్వవిద్యాలయానికి రెండు వరుసల రహదారి నిర్మాణం చేపట్టాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలు ఏ దశలో ఉన్నాయో అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదించాలన్నారు. భవనాల నిర్మాణం సకాలంలో పూర్తికావాలన్నారు. నీటి సరఫరా పనులు చేపట్టాలన్నారు. రాబోయే విద్యాసంవత్సరానికి విశ్వవిద్యాలయంలో తరగతులు ప్రారంభించే లక్ష్యంగా పనులు చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీఓ మధుసూదన్, విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ హనుమాన్ కెనడి, పీఆర్ ఎస్‌ఈ భాగ్యరాజ్, ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈ సురేంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎహసాన్ బాషా, హెచ్ఎల్‌సీ ఎస్‌ఈ రాజశేఖర్ సీపీడబ్ల్యూడీ ఈఈశ్రీనివాస్, ఏపీఎస్‌సీఆర్‌ఐసీ ఈఈ ప్రభాకర్‌రెడడి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైల్వే ప్రాజెక్టులపై దృష్టి పెట్టండి

రైల్వే ప్రాజెక్టుల పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఎం.గౌతమి అధికారులను ఆదేశించారు. రైల్వే ప్రాజెక్టుల లెవల్ క్రాసింగ్‌ల భూ సేకరణ అంశంపై కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ఆర్డీఓలు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 17 రకాల రైల్వే ప్రాజెక్టులకు ప్రతిపాదనలు వచ్చాయని తెలిపారు. ఇందులో ధర్మవరం– పాకాల సెక్షన్ పరిధిలో గొల్లపల్లి వద్ద, గుత్తి–ధర్మవరం సెక్షన్‌లోని ప్రసన్నాయపల్లి, పామిడి, సోములదొడ్డి, తాటిచెర్ల, గార్లదిన్నె, కందుకూరు, గజరాంపల్లి, రామరాజులపల్లి వద్ద ప్రాజెక్టులకు ప్రతిపాదనలు వచ్చాయన్నారు. అలాగే కల్లూరు– గుంతకల్లు సెక్షన్‌లో గుంతకల్లు వద్ద, రేణిగుంట– గుత్తి సెక్షన్ పరిధిలో తాడిపత్రి ఆటోనగర్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రతిపాదనలు వచ్చాయని వెల్లడించారు. ప్రతిపాదనలు వచ్చిన ప్రాంతాల్లో భూ సేకరణ వేగవంతం చేయాలని ఆదేశించారు. సర్వే, పెగ్ మార్కింగ్ ప్రక్రియలను పూర్తి చేయాలని ఆదేశించారు. రైల్వే శాఖకు అన్ని శాఖల అధికారులు సహాయ సహకారాలు అందించాలన్నారు. సమావేశంలో అనంతపురం, గుంతకల్లు, కళ్యాణదుర్గం ఆర్డీఓలు మధుసూదన్, రవీంద్ర, నిషాంత్‌రెడ్డి, రైల్వే శాఖ డీఈ రమణరావు, పీఆర్ ఎస్‌ఈ భాగ్యరాజ్, ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈ సురేంద్ర, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఓబుళరెడ్డి, ట్రాన్స్‌కో ఎస్‌ఈ కరుణాకర్, కలెక్టరేట్ భూపరిపాలన విభాగం సూపరింటెండెంట్ బాలాజీ, డీటీ సోమశేఖర్ పాల్గొన్నారు.

16 నుంచి ఈవీఎంల తొలి దశ తనిఖీ

అనంతపురం అర్బన్: ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల తొలి దశ తనిఖీ (ఫస్ట్ లెవల్ చెకింగ్ –ఎఫ్ఎల్‌సీ) ఈ నెల 16 నుంచి 20 వరకు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ గౌతమి ఆదేశించారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల ఎఫ్ఎల్‌సీ, ఇతర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా శుక్రవారం విజయవాడ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయత్రీదేవి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల ఎఫ్ఎల్‌సీ ప్రక్రియ కోసం అవసరమైన సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎఫ్ఎల్‌సీ నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అధ్యక్షుల నుంచి ఫొటోతో ఆథరైజేషన్ ఉన్నవారికి మాత్రమే ఎఫ్ఎల్‌సీ ప్రక్రియ పరిశీలనకు ప్రవేశం ఉంటుందన్నారు. సమావేశంలో ఆర్డీఓలు మధుసూదన్, రవీంద్ర, డిప్యూటీ కలెక్టర్లు సుధారాణి, శ్రీనివాసులు, ఆనంద్, వెంకటేశ్వర్లు, కేశవనాయుడు, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లకు వంట సామాన్లు

ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీ సిబ్బందికి కష్టాలు తీరనున్నాయి. ఏళ్ల క్రితం నాటి సిల్వర్ పాత్రల స్థానంలో నాణ్యతతో కూడిన స్టీలు పాత్రలను ప్రభుత్వం అందించనుంది. ఇకపై సిబ్బంది సరిపడునన్ని పాత్రలతో మెనూ ప్రకారం వంట తయారు చేయడానికి మార్గం సుగమమైంది.

- నాణ్యమైన స్టెయిన్‌లెస్ స్టీలు పాత్రలు సరఫరా
- విద్యార్థుల సంఖ్య ఆధారంగా 5 నుంచి 11 రకాల వస్తువులు



పాఠశాలలకు సరఫరా చేయనున్న వంట పాత్రలు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థుల హాజరు శాతం పెంచడానికి ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం ప్రవేశపెట్టింది. 2010లో వంట తయారీకి అవసరమైన పాత్రలను ప్రభుత్వం పంపిణీ చేసింది. తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం వీటి గురించి పట్టించుకోలేదు. అరకొర పాత్రలతోనే ఏజెన్సీ సిబ్బంది వంట చేస్తున్నారు. కొన్ని స్కూళ్లలో వంట పాత్రలే లేకపోవడంతో ఏజెన్సీకి చెందిన మహిళలే సమకూర్చుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో 'జగనన్న గోరుముద్ద పథకం' ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారు. మెనూపై ప్రత్యేక దృష్టి సారించారు. 'రాగిజావ' కూడా చేర్చారు. ఇన్ని రకాల వంటల తయారీకి సరిపడు పాత్రలు లేక అగచాట్లు పడుతున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళల కష్టాలు తీర్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రతి ఏజెన్సీకీ అత్యంత నాణ్యతతో కూడిన 'స్టెయిన్‌లెస్ స్టీలు పాత్రలు' అందించేందుకు చర్యలు చేపట్టింది. గతంలో ఉన్న సిల్వర్ పాత్రల స్థానంలో స్టీలు పాత్రలను సరఫరా చేసింది. ఇప్పటికే జిల్లా కేంద్రం నుంచి అన్ని మండల కేంద్రాలకూ చేరాయి. ఎంఈఓల ఆధ్వర్యంలో వాటిని భద్రపరిచారు. అక్కడి నుంచి పాత్రలను పాఠశాలలకు తరలించనున్నారు.

1,581 స్కూళ్లకు వంటపాత్రలు

జిల్లాలో 1,694 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది. ఇందులో 113 స్కూళ్లకు ఇస్కాన్, అన్నపూర్ణ, అక్షయపాత్ర సంస్థలు మధ్యాహ్న భోజనం అందిస్తున్నాయి. తక్కిన 1,581 స్కూళ్లలో ఏజెన్సీలు నిర్వహిస్తున్నాయి. ఈ 1,581 స్కూళ్లకు వంటపాత్రలు సరఫరా చేస్తున్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా 5 నుంచి 11 రకాల వస్తువులను పంపిణీ చేస్తున్నారు. మండల కేంద్రాల నుంచి ఎండీయూ వాహనాల ద్వారా ఆయా స్కూళ్లకు చేర్చుతారు. ఇందుకు సంబంధించిన రవాణా బిల్లులు కూడా ప్రభుత్వం మంజూరు చేసింది. మొత్తం జిల్లా వ్యాప్తంగా మండలాల నుంచి స్కూళ్లకు తరలించేందుకు రూ.2.37 లక్షల నిధులను కేటాయించారు.

చాలా నాణ్యమైనవి ఉన్నాయి



మధ్యాహ్న భోజనం తయారీకి, వడ్డించేందుకు ప్రభుత్వం పంపిణీ చేసిన స్టీలు పాత్రలు చాలా క్వాలిటీగా ఉన్నాయి. ఇప్పుడున్న పాత్రలతో వంటలు తయారు చేయాలంటే చాలాచోట్ల ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థుల సంఖ్య బాగా పెరిగింది. వంటపాత్రలు తక్కువగా ఉన్నాయి. అవికూడా కొన్నిచోట్ల దెబ్బతిన్నాయి. కొత్త పాత్రలు ఇప్పటికే మండల కేంద్రాలకు చేరాయి. అక్కడి నుంచి స్కూళ్లకు త్వరలోనే సరఫరా చేస్తాం.

– వి.నాగరాజు, డీఈఓ

క్రీడల్లో జిల్లాకు పేరుప్రతిష్టలు తీసుకురండి

అనంతపురం: క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కలెక్టర్ గౌతమి క్రీడాకారులకు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో ఏపీ స్టేట్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్–2023 పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ నెల 16వ తేదీ వరకు అండర్–11, 13, 15, 17, 19 విభాగాల్లో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్రంలోని 11 జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రికెట్, హాకీతో పాటు ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ పోటీల్లో జిల్లాకు చెందిన బాలబాలికలు ఎక్కువమంది ప్రాతినిధ్యం వహిస్తుండటం సంతోషదాయకమన్నారు. అంతర్జాతీయ స్థాయి క్రికెట్‌లో బాలికలు రాణిస్తూ ఇతరులకు మార్గదర్శకంగా నిలుస్తున్నారని కొనియాడారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలన్నారు. క్రీడల ద్వారా నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు.



టేబుల్ టెన్నిస్ పోటీలో తలపడిన క్రీడాకారులు

'ఆడుదాం ఆంధ్రా' సద్వినియోగం చేసుకోండి

డిసెంబర్ 11 నుంచి జనవరి 15 వరకు 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమం కింద క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. 17 సంవత్సరాలు దాటిన క్రీడాకారులు ఈ పోటీలను సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. జిల్లా నుంచి క్రీడాకారులు దేశ విదేశాల్లో జరిగే క్రీడా పోటీల్లో పాల్గొని విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఆరోగ్యకరమైన పోటీలు చాలా ముఖ్యమన్నారు. అనంతరం ముఖ్య అతిథి కలెక్టర్‌ను డాక్టర్ అక్బర్ తదితరులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ బి.మురళీధర్, సెక్రటరీ కేశవరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఎం.శ్రీనివాసరెడ్డి, చీఫ్ రెఫరీ రమణకుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

భూగర్భజలం 'పది'లం

- జిల్లా సగటు నీటిమట్టం 10 మీటర్లుగా నమోదు



బోరుబావి నుంచి సమృద్ధిగా నీళ్లు


అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా ఉన్న 97 ఫిజోమీటర్ల నుంచి భూగర్భజలశాఖ తాజాగా సేకరించిన గణాంకాల ప్రకారం జిల్లా సగటు నీటి మట్టం 10 మీటర్లుగా నమోదైంది. అందులో యాడికి, డి.హీరేహాళ్, కణేకల్లు, శెట్టూరు... ఈ నాలుగు మండలాల్లో మాత్రమే సగటున 15 మీటర్లకు పైగా నమోదైంది. అలాగే బెళుగుప్ప, గుత్తి, కళ్యాణదుర్గం, పామిడి, పుట్లూరు, రాయదుర్గం, తాడిపత్రి ప్రాంతాల్లో కూడా కొంచెం తగ్గాయి. ఇక 20 మండలాల్లో భూగర్భజలాలు మెరుగ్గానే ఉన్నాయి. ఈ సీజన్‌లో 320 మి.మీ గానూ 22 శాతం తక్కువగా 250 మి.మీ వర్షపాతం నమోదైనా... 30 మండలాలు ఇప్పటికీ సురక్షిత జాబితా (సేఫ్‌జోన్)లో ఉన్నాయి. మోతాదుకు మించి భూగర్భజలాలు వాడుతున్న యల్లనూరు మండలాన్ని మాత్రమే డేంజర్‌జోన్‌లో ఉంచారు. జిల్లాలో ఉన్న 1,87,610 వ్యవసాయ బోర్లు పూర్తిస్థాయిలో పనిచేస్తుండగా... అధికారికంగా 12 గ్రామాల్లో మాత్రమే వాల్టా చట్టం అమలు చేస్తున్నట్లు భూగర్భజలశాఖ డీడీ కె.తిప్పేస్వామి తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

అనంతపురం క్రైం: స్థానిక వన్‌టౌన్ పోలీసులు పేకాట స్థావరాలపై దాడులు చేశారు. ఈ దాడుల్లో కమలానగర్ ఎస్‌ఆర్‌ఎస్ లాడ్జిలో పేకాట ఆడుతున్న 8 మందిని, సమీపంలోని మెకానిక్ షెడ్‌లో పేకాట ఆడుతున్న మరో నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 54 వేల నగదుని స్వాధీనం చేసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారం ఇవ్వాలని సీఐ రెడ్డెప్ప ప్రజలను కోరారు.

ఉపాధ్యాయులూ జాగ్రత్త!

- ప్రతి పాఠశాలలోనూ రూ.లక్షల విలువ చేసే డిజిటల్ బోధనా పరికరాలు
- సెలవు రోజుల్లో జాగ్రత్తగా చూసుకోవాలంటున్న విద్యాశాఖ అధికారులు



ఐఎఫ్ ప్యానెల్ బోర్డు

అనంతపురం ఎడ్యుకేషన్: నేటి నుంచి దసరా సెలవులు ప్రారంభం కావడంతో బడులు మూతపడనున్నాయి. ప్రతి పాఠశాలలోనూ లక్షలాది రూపాయల విలువ చేసే ఖరీదైన సామగ్రి ఉన్న నేపథ్యంలో సంబంధిత హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉంటూ వాటిని దుర్వినియోగం కాకుండా చూసుకోవాలని విద్యాశాఖ అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి వి.నాగరాజు జిల్లాలోని ఎంఈఓలు, హెచ్‌ఎంలకు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యాశాఖలో సంస్కరణలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగానే అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద పిల్లలు ప్రపంచ స్థాయిలో పోటీపడేలా మానవ వనరులను తయారు చేయడానికి, కార్పొరేట్ స్థాయి విద్య అవకాశాలు అందించాలనే లక్ష్యంతో 'మనబడి నాడు నేడు' అనే కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగానే కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పాఠశాలల రూపురేఖలు మార్చింది. విద్యార్థులకు సులువుగా పాఠాలు అర్థమయ్యేలా సాంకేతికతను జోడించి 'డిజిటల్ విద్యను' తీసుకొచ్చింది.

1595 ఇంటరాక్ట్ ఫ్లాట్ ప్యానల్స్

జిల్లాలో గతేడాది 8వ తరగతి విద్యార్థులు, వారికి బోధించే ఉపాధ్యాయులకు సుమారు 25,470 ట్యాబ్‌లు ఇచ్చారు. 'నాడు నేడు' ఫేజ్–1 కింద పూర్తయిన 534 పాఠశాలలకు ఒక్కొక్కటి రూ. 1.35 లక్షలు విలువచేసే 1,595 ఇంటరాక్ట్ ఫ్లాట్ ప్యానల్స్, ఒక్కొక్కటి రూ. లక్ష విలువచేసే 759 స్మార్ట్ టీవీలను సరఫరా చేశారు. ఇంతటి విలువైన వస్తువులపై సెలవు దినాల్లో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని డీఈఓ వి.నాగరాజు ఆదేశించారు.

ప్యానల్స్, స్మార్ట్ టీవీల నిర్వహణ

- లక్షలు విలువ చేసే ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులదే. ప్రతి పాఠశాలలో విలువైన సామగ్రిని కాపాడుకోవడానికి భద్రతా చర్యలు తీసుకోవాలి.
- సెలవు దినాల్లో ప్రతి ఎలక్ట్రానిక్ వస్తువుకు పవర్ సప్లయ్ ఆఫ్ చేసి, పవర్ సప్లయ్ ప్లగ్ నుంచి వైర్లను వేరుచేయాలి.
- ప్రతి పాఠశాలలోనూ విలువైన వస్తువుల వివరాలను నమోదు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్, సచివాలయంలో అందజేసి సెలవు దినాల్లో పోలీసులు పర్యవేక్షించేలా చూడాలి.
- సెలవు దినాల్లో ప్రతి విద్యార్థి ట్యాబ్‌ను సక్రమంగా ఉపయోగించుకొనేలా చూడాలి. ట్యాబ్‌లో మూడు యాప్‌లు వచ్చేలా అప్‌డేట్ చేయించాలి. తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలి.

సురక్ష శిబిరాలు.. రక్షణ కవచాలు





జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో మందుల కిట్లను పంపిణీ చేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ రంగయ్య. వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

- విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ తలారి రంగయ్య

రాయదుర్గం రూరల్/బొమ్మనహాళ్/కణేకల్లు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ప్రజల పాలిట రక్షణ కవచాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ తలారి రంగయ్య అన్నారు. శుక్రవారం బొమ్మనహాళ్ మండలం గోవిందవాడ, కణేకల్లు మండలంలోని యర్రగుంట, రాయదుర్గం మండలంలోని 74 ఉడేగోళం గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు ప్రభుత్వ విప్, ఎంపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంత వరకు ఎంతో మంది పాలకులను మనం చూసి ఉండవచ్చని , అయితే ప్రజా సంక్షేమం , ఆరోగ్యం గురించి ఆలోచించిన కుటుంబం మాత్రం కేవలం వైఎస్‌ఆర్ కుటుంబం మాత్రమే అన్నారు. మహానేత వైఎస్సార్ ఆరోగ్యశ్రీతో రెండడుగులు ముందుకేస్తే... ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు అడుగులు ముందుకేసి వైద్య బృందాన్నే ప్రజల ముంగిటకు తెచ్చి పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించడం అభినందనీయమన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో 11 రకాల సేవలందిస్తున్నట్లు తెలిపారు. పేదవాడికి సైతం కార్పొరేట్ వైద్యం అందించాలనే దృఢ సంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని తీసుకొచ్చారన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పాటు పడుతున్న ముఖ్యమంత్రి జగన్‌పై మోసకారి చంద్రబాబు అండ్ కో బ్యాచ్ లేనిపోని మాటలతో వంచనకు పాల్పడడానికి వస్తే మోసపోవద్దన్నారు. దొంగల మాటలు నమ్మవద్దని సూచించారు. మంచి చేసే ప్రభుత్వాన్ని మళ్లీ నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

అనంతపురం క్రైం: అదనపు కట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై బాధితురాలు శుక్రవారం త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ ధరణీకిషోర్ తెలిపిన వివరాలమేరకు.. స్థానిక రంగస్వామినగర్‌కు చెందిన బెడదూరి నర్మదను శింగనమల మండలం ఉల్లికల్లుకు చెందిన అజ్జుగుట్ట నరేంద్రకు ఇచ్చి 2019లో వివాహం జరిపించారు. కొంతకాలం వారి బంధం సాఫీగా సాగింది. అయితే భర్తకు డబ్బు మీదున్న అత్యాశతో భార్యను వేధించడం ప్రారంభించాడు. ఈ క్రమంలో పలు మార్లు పెద్దల సమక్షంలో పంచాయితీలు కూడా జరిగాయి. మార్పురాక పోగా వేధింపులు అధికం కావడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. భారీగా కట్న కానుకలు ఇచ్చినా తనకు వచ్చిన జీతాన్ని కూడా తీసేసుకుని కనీసం చేతిఖర్చులకు కూడా ఇవ్వకుండా వేధిస్తున్నారని నర్మద పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టరు సీజ్

బుక్కరాయసముద్రం నీలంపల్లి గ్రామంలోని వంకలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నరహరి ఈశ్వరరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ ధరణీకిషోర్ తెలిపారు. ఈ మేరకు ట్రాక్టరును సీజ్ చేశామన్నారు.

రైలు ప్రయాణికుల భద్రతే ముఖ్యం

- ఆర్‌పీఎఫ్ ఐజీ అరోమా సింగ్ ఠాకూర్



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఆర్‌పీఎఫ్ సౌత్ సెంట్రల్ ఐజీ అరోమా సింగ్ ఠాకూర్

అనంతపురం సిటీ/ధర్మవరం రూరల్: రైల్వే ప్రయాణికుల భద్రతే తమకు ముఖ్యమని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) ఐజీ అరోమా సింగ్ ఠాకూర్ తెలిపారు. అనంతపురం, ధర్మవరం రైల్వే స్టేషన్లలోని ఆర్‌పీఎఫ్ స్టేషన్లను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం సమీక్ష సమావేశం నిర్వహించారు. పాత కేసుల గురించి ఆరా తీశారు. రైళ్లకు ఎస్కార్ట్‌గా వెళ్లే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రైళ్లల్లో దోపిడీలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పాత నేరస్తులపై ఓ కన్నేసి ఉంచాలని పేర్కొన్నారు. రైల్వే స్టేషన్లు, పరిసరాల్లో విద్రోహ శక్తుల కదలికలపై నిఘా ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా మహిళా ప్రయాణికుల మాన, ప్రాణాలకు పూర్తి స్థాయిలో రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఆర్‌పీఎఫ్ సిబ్బందిదేనని స్పష్టం చేశారు. నిషేధిత పదార్థాలు కూడా సరఫరా కాకుండా చూడాలన్నారు. జీఆర్‌పీ సిబ్బంది సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం అనంతపురం, ధర్మవరం ఆర్‌పీఎఫ్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఆమె వెంట గుంతకల్లు డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ మురళీకృష్ణ, సహాయ కమిషనర్ విశ్వనాథ్ మిశ్రా, ఆర్పీఎఫ్ అనంతపురం ఎస్‌ఐ మధుకర్‌చారి, ఏఎస్‌ఐ ఎస్‌ఎండీ రఫీ ఉన్నారు.

భవనంపై నుంచి కిందపడి తాపీ మేస్త్రీ మృతి



మృతుడు హరిజన మురళి

కనగానపల్లి: ఇంటి నిర్మాణ పనులు చేస్తూ ప్రమాదవశాత్తూ భవనం పై నుంచి కిందపడిన తాపీ మేస్త్రీ మృతి చెందిన సంఘటన గుంతపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకొంది. స్థానికుల వివరాల మేరకు.. గుంతపల్లి ఎస్సీ కాలనీకి చెందిన హరిజన మురళీ (32) తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన గొల్ల బుజ్జన్న ఇంటి నిర్మాణం చేస్తున్నారు. ఇందులో భాగంగా సారవపైకి ఎక్కి గోడ నిర్మాణం చేస్తుండగా ప్రమాదవశాత్తూ కాలు జారీ కింద పడ్డాడు. సుమారు 15 అడుగుల ఎత్తు నుంచి కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతన్ని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య ప్రశాంతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్రిడ్జ్ డోరు తీస్తుండగా విద్యుదాఘాతం

- వ్యక్తి మృతితో గంగవరంలో విషాదఛాయలు



బాషా (ఫైల్)

బెళుగుప్ప: మండలంలోని గంగవరం గ్రామంలోని కోట వీధికి చెందిన బాషా (58) విద్యుదాఘాతంతో మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు... మృతుడు బాషా తన ఇంటిలోని ఫ్రిడ్జ్‌లో పాలను నిల్వ చేశాడు. ఇందులో భాగంగానే శుక్రవారం పాల ప్యాకెట్లు తీద్దామని ఫ్రిడ్జ్ డోర్ తీస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడన్నారు. కాలనీలో హైఓల్టేజీతో విద్యుత్ సరఫరా కావడంతోనే ప్రమాదం జరిగిందన్నారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన బాషాను హుటాహుటిన కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతునికి భార్య శర్మస్‌బీ, కుమారులు సాధిక్‌వలీ, జబీవుల్లా ఉన్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ రామకృష్ణయ్య, విద్యుత్‌శాఖ ఏఈ గంగాధర్‌గుప్తా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుని కుమారుడు జబీవుల్లా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడిగా ఉన్న బాషా మృతి చెందడంతో విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వై విశ్వేశ్వర రెడ్డి గంగవరం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎంపీటీసీ ప్రసాద్, సర్పంచ్ రోజా, ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణ, తదితరులు నివాళులర్పించారు.

ఇద్దరు డీజిల్ దొంగల అరెస్ట్

- కారు, నగదు, డీజిల్, పైపు స్వాధీనం

యాడికి: పార్కింగ్ చేసిన లారీల్లో డీజిల్ దొంగతనం చేసే ఇద్దరిని యాడికి పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి కారు, నగదు, డీజిల్‌తో పాటు పైపు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు తెలంగాణకు చెందినవారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి శుక్రవారం మీడియాకు వెల్లడించారు. ఈ నెల పదో తేదీ అర్ధరాత్రి యాడికి మండలం రాయలచెరువు, పెద్దపప్పూరు మండలం జోడి ధర్మాపురం వద్ద గల టోల్‌ప్లాజ్ వద్ద నిలిపి ఉన్న నాలుగు లారీల్లో 1,400 లీటర్ల డీజిల్ చోరీ అయ్యింది. ఈ ఘటనలపై లారీడ్రైవర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీజిల్ దొంగల కోసం యాడికి ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి నిఘా పెట్టారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి వేములపాడు క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. తాడిపత్రి నుంచి వస్తున్న కారు ఆపకుండా గుత్తి వైపు వేగంగా వెళ్లింది. ఎస్‌ఐ, పోలీసు సిబ్బంది జీపులో వెంబడించి రాయలచెరువు గ్రామంలో రైల్వే గేటు సమీపాన కారును నిలిపి.. అందులో ఉన్న తెలంగాణ రాష్ట్రం నారాయణ పేట జిల్లా సర్వ మండలం జంగంరెడ్డిపల్లికు చెందిన రాజేష్ నాయక్, మరికల్ మండలం గాజులయ్య తండాకు చెందిన షెబావత్ కిషన్ నాయక్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా.. డీజిల్ దొంగలని తేలింది. వారిని అరెస్ట్ చేసి, రూ.85వేల నగదుతో పాటు క్యాన్లలో తీసుకెళ్తున్న 400 లీటర్ల డీజిల్, పైపును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

19న పండ్లతోటల రైతు సంఘం రాష్ట్ర సదస్సు

అనంతపురం అర్బన్: పండ్లతోటల రైతు సంఘం రాష్ట్ర సదస్సు ఈనెల 19న తాడిపత్రిలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక సంఘం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా కొన్నేళ్లగా ఉద్యాన పంటలు దెబ్బతింటున్నాయన్నారు. దీంతో పండ్ల తోటల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ క్రమంలో కొందరు రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న సాగు ఖర్చులు తగ్గించి, ఆత్మహత్యల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర సదస్సులో వివిధ అంశాలుపై చర్చించి తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని సదస్సు జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రాజారామిరెడ్డి, బీహెచ్‌రాయుడు, పోతులయ్య పాల్గొన్నారు.

కట్టుకున్నోడే కాలయముడు

- భార్యను కడతేర్చి అనారోగ్యంతో చనిపోయిందని చిత్రీకరణ
- కుమారుడి ఫిర్యాదుతో కటకటాల్లోకి..



మాట్లాడుతున్న డీఎస్పీ బీ శ్రీనివాసులు

రాయదుర్గం: అతను తాగుబోతు..పైగా తిరుగుబోతు.. తాగుడు మాని బుద్ధిగా ఉండాలని చెప్పిన భార్యపై దాడి చేసి అనంత లోకాలకు పంపాడు. పైగా అనారోగ్యంతో చనిపోయిందని అందరినీ నమ్మించాడు. అయితే కుమారుడి ఫిర్యాదుతో అసలు నిజం బయట పడటంతో ఊచలు లెక్కిస్తున్నాడు. కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం రాయదుర్గంరూరల్ సర్కిల్ కార్యాలయం వద్ద సీఐ యుగంధర్, ఎస్‌ఐ దుగ్గిరెడ్డితో కలిసి డీఎస్పీ బీ శ్రీనివాసులు విలేకర్లకు వెల్లడించారు. కణేకల్లు మండలం సొల్లాపురానికి చెందిన మాదల వన్నూర్‌స్వామితో బెళుగుప్ప మండలం శిర్పికి చెందిన మాదల చిట్టెమ్మకు 22 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు ఉన్నారు. దంపతుల మధ్య తరచూ గొడలు జరిగేవి. గత నెల 9న మాదల వన్నూర్ స్వామి, భార్య చిట్టెమ్మ (44) తో గొడవపడి కర్రతో తలపై బాదాడు. ఆమె మృతి చెందింది. అనారోగ్యమే మృతికి కారణమంటూ వన్నూర్‌స్వామి అందరినీ నమ్మించి పాతిపెట్టాడు. పనిపై వెళ్లిన కుమారుడు గత నెల 11న స్వగ్రామానికి వచ్చి తల్లి మృతికి గల కారణాలపై ఆరా తీశాడు. తండ్రిపై అనుమానం వ్యక్తం చేస్తూ అదేరోజు కణేకల్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కణేకల్లు తహసీల్దార్ సమక్షంలో పాతిపెట్టిన శవాన్ని వెలికితీసి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. చిట్టెమ్మ తలకు బలమైన దెబ్బ తగలడంతోనే మృతి చెందినట్టు నిర్ధారణ అయింది. దీంతో నిందితుడిపై ఐపీసీ 302, 201 సెక్షన్ల కింద కేసుగా నమోదు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు సొల్లాపురం బస్టాండ్ వద్ద నిందితుడిని అరెస్టు చేశామన్నారు. కర్రతో బాదడంతోనే చిట్టెమ్మ చనిపోయినట్లు విచారణలో నిందితుడు ఒప్పుకున్నాడన్నారు.

వేరుశనగ కోత యంత్రం బోల్తా

- నలుగురికి గాయాలు

గుత్తిరూరల్: మండంలోని ఊబిచెర్ల గ్రామ శివారులో శుక్రవారం వేరుశనగ కోత యంత్రం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో నలుగురు మహిళా కూలీలకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాలమేరకు.. కరిడికొండ గ్రామానికి చెందిన మహిలక్ష్మీ, లక్ష్మీదేవీ, వరలక్ష్మీ, ఊబిచెర్లకు చెందిన లక్ష్మీదేవీతో పాటు మరో ఇద్దరు ఊచిచెర్ల గ్రామ శివారులో పంట పొలాల్లో వేరశనగ కోతకు వెళ్లారు. ఓ రైతు పొలంలో వేరుశనగ కట్ట తొలగించిన అనంతరం మరో పొలంలోకి వెళ్తుండగా కోత యంత్రం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో మహలక్ష్మీ, వరలక్ష్మీ, లక్ష్మీదేవీ, శ్రీలక్ష్మీదేవీలకు తీవ్రగాయాలయ్యాయి, గాయపడిన వారిని వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు వారిని కర్నూలు, అనంతపురంకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైఫిల్ షూటింగ్, ఖోఖో జట్ల ఎంపిక



రైఫిల్ షూటింగ్‌కు ఎంపికైన క్రీడాకారులు



ఖోఖో జట్టు సభ్యులు

అనంతపురం: స్కూల్ గేమ్స్ సెలక్షన్‌లో భాగంగా అండర్–17, అండర్–14 బాల, బాలికల రైఫిల్ షూటింగ్, ఖోఖో జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. అనంతపురంలోని ఆర్యన్ అకాడమీలో రైఫిల్ షూటింగ్, న్యూటౌన్ జూనియర్ కళాశాలలో ఖోఖో పోటీలు జరిగాయి. రైఫిల్ షూటింగ్ పోటీలు అనంతపురం జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ బి.సుగుణమ్మ, శ్రీసత్యసాయి జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ అంజన్న, ఎస్‌జీఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ ఎల్. నాగరాజు, శ్రీసత్యసాయి జిల్లా కోఆర్డినేటర్ డి. మొరార్జీ యాదవ్ ఆధ్వర్యంలో జరిగాయి. రాష్ట్ర స్థాయి పోటీలు త్వరలో తూర్పుగోదావరి జిల్లాలో జరగనున్నాయి.

రైఫిల్ షూటింగ్ ఎంపికైన వారు.. : ప్రవల్లిక, అన్విత, కావ్య, దీవెన, పటాన్, సుహాస్, సువర్ణ, ఉద్యతి, సమంత, రజిత, తేజశ్విని, సుహా, శృతి, డి.రోహిత్ యాదవ్, అఖిల్, అజయ్, భానుప్రకాష్‌రెడ్డి, మహేష్ , శశాంక్.

ఖోఖోకు ఎంపిక వారు.. : స్వప్న, సంధ్య, సోహిక, సునీత, మౌనిక, రాజ్యలక్ష్మి, మానస, జయశాలిని, లతిక, భవ్యశ్రీ, హేమలత, ఐశ్వర్య.

ఎంటెక్, ఎంసీఏ ఫలితాల విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ


అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో అక్టోబర్ –2023లో నిర్వహించిన ఎంటెక్ రెండో సెమిస్టర్ , ఎంసీఏ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫలితాలను ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ శుక్రవారం విడుదల చేశారు. ఫలితాలు తెలుసుకోవడానికి జేఎన్‌టీయూ అనంతపురం కళాశాల అకడమిక్ సెక్షన్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఈ. అరుణకాంతి, డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ విష్ణువర్ధన్, లలిత కుమారి, పాలక మండలి సభ్యుడు రామశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాబు అరెస్టులో కేంద్ర హస్తం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

కళ్యాణదుర్గం రూరల్: చంద్రబాబు అరెస్టు వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ హస్తం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆరోపించారు. శుక్రవారం కళ్యాణదుర్గం పట్టణంలోని ఓ కళ్యాణ మండపంలో బీటీపీ కాలువకు భూములు కోల్పోయిన రైతులతో ముఖా ముఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ బీటీపీ కాలువకు భూములు కోల్పోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని, లేకపోతే రైతులతో కలసి కలెక్టరేట్ ముట్టడిస్తామన్నారు. కేవలం కుట్ర పూరితంగానే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కలిసి ప్రతిపక్ష నేత చంద్రబాబును అరెస్టు చేయించారన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయమన్నారు. చంద్రబాబు అరెస్టు వల్లే తెలంగాణలో కూడా బీజేపీకి ఆదరణ తగ్గిందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



నాగలక్ష్మి (ఫైల్)

తాడిపత్రి: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో అనారోగ్యంతో నాగలక్ష్మి (43) అనే మహిళ శుక్రవారం రాత్రి ఇంట్లో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు... నాగలక్ష్మికి కొంత కాలంగా ఆరోగ్యం బాగాలేదు. దీంతో నిత్యం బాధపడుతూనే ఉండేది. ఈ నేపథ్యంలోనే జీవితంపై విరక్తి చెంది నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలికి భర్త నాగేంద్రరెడ్డి, 14 సంవత్సరాల కుమార్తె ఉన్నారు.

క్లుప్తంగా

త్వరలో ఆర్టీసీ చైర్మన్, ఎండీ పర్యటన

అనంతపురం సెంట్రల్: ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఎండీ ద్వారాక తిరుమలరావు (ఐపీఎస్) త్వరలో జిల్లాలో పర్యటించనున్నారు. అనంతపురం డిపో పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో వారు పాల్గొననున్నారు. ఆర్టీసీ డిపో ఆవరణ అంతా పరిశుభ్రం చేస్తున్నారు. శుక్రవారం ఉదయం జిల్లా ప్రజారవాణా అధికారి సుమంత్ ఆర్ ఆదోని డిపోను తనిఖీ చేశారు. ఎక్కడా అపరిశుభ్రతకు తావులేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బస్‌స్టేషన్ మేనేజర్ మూర్తి జేసీబీతో డిపో పరిధిలో చెత్తాచెదారం తొలగింపజేశారు.

ఎస్కేయూ పాలకమండలి సభ్యురాలిగా డాక్టర్ అనిత



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యురాలిగా కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కే అనిత నియమితులయ్యారు. ఈ మేరకు ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ జే శ్యామలరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సెప్టెంబర్ 1న వర్సిటీ పాలక మండలిని నియామకం చేస్తూ జీఓ 76ను జారీ చేశారు. అందులో పాలక మండలి సభ్యుల పేర్లలో ఇంటిపేరు తప్పుగా అచ్చయ్యింది. దీంతో జీఓ నంబర్ 76కు సవరణ జీఓ 104ను జారీ చేశారు. కెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కే అనిత 2010లో ఉద్యోగంలో చేరారు. పాలక మండలిలో మహిళలకు 50 శాతంతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు 50 శాతం పైగా స్థానాలను కట్టబెట్టేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేస్తున్నారు.

వాటర్ డిస్పెన్సర్ల వితరణ



వాటర్ డిస్పెన్సర్లను అందిస్తున్న దృశ్యం

అనంతపురం క్రైం: పోలీసు శాఖకు అర్జాస్ స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం 55 వాటర్ డిస్పెన్సర్లను వితరణ చేసింది. శుక్రవారం కంపెనీ నిర్వాహకులు ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌ను కలిసి వీటిని అందించారు. కార్యక్రమంలో కంపెనీ సీఎస్ఆర్ హెడ్ కేఎం రామ్, సాంబశివారెడ్డి, అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కరరెడ్డి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు త్రిలోక్, సుధాకరరెడ్డి, ఎంటీఓ రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపిక



నిహారికను అభినందిస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: విజయవాడలోని కేఎల్ యూనివర్సిటీలో ఈ నెల 10 నుంచి జరగనున్న ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ డేకు బోధనాస్పత్రి డెర్మటాలజీ విద్యార్థిని మాచాని నిహారిక ఎంపికైంది. దీంతో శుక్రవారం వైద్య కళాశాలలో డాక్టర్ నిహారికను ప్రిన్సిపల్ డాక్టర్ మాణిక్యరావు అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, ప్రొఫెసర్లు డాక్టర్ ఆత్మారాం, డాక్టర్ కేఎల్ సుబ్రమణ్యం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

స్టాంప్ ఫీజు రద్దు చేయాలి



దీక్షలో పాల్గొన్న న్యాయవాదులు

అనంతపురం: ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ పెంచిన రూ.20 న్యాయవాద సంక్షేమ స్టాంప్ ఫీజును వెంటనే రద్దు చేయాలని అనంతపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు చేపట్టిన రిలే దీక్ష 9వ రోజుకు చేరింది. అనంతపురం న్యాయవాదుల గుమస్తాల సంఘం శుక్రవారం నిరాహార దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపింది. అనంతపురం న్యాయవాదుల గుమస్తాల సంఘం అధ్యక్షుడు రామచంద్ర, సీనియర్ గుమస్తా షేక్షావలి, సభ్యులు ఉదయ్‌కుమార్, శ్రీనివాసులు, చంద్రశేఖర్, ఈశ్వరయ్య, శివ తదితరులు పాల్గొన్నారు. వీరికి మద్దతుగా సీనియర్ న్యాయవాదులు వై. రామలింగారెడ్డి, జి. నరసింహులు, బడా నారాయణరెడ్డి, ఆర్. లక్ష్మీనరసింహ వరప్రసాద్, ఎం. రాము, దస్తగిరి, గంగాధర్, రంగనాయకులు తదితరులు శిబిరాన్ని సందర్శించారు.

నేటి నుంచి సమావేశాలు

అనంతపురం అర్బన్: నగరంలో సీఐటీయూ రాయలసీమ ప్రాంతీయ సమావేశాలు శని, ఆదివారం రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు నాగమణి, మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజుతో కలిసి ఆయన మాట్లాడారు. స్థానిక గణేనాయక్ భవన్‌లో ప్రాంతీయ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. రాయలసీమ ప్రాంత కార్మికుల సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



రామగిరిలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రామగిరి: సంక్షేమ పథకాలు ప్రజలందరికీ ఎలా వర్తింపజేయాలో పరితపించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, రాబోవు ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన రామగిరిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో టీడీపీ హయాంలో రాక్షస పాలన చూశామన్నారు. ప్రస్తుతం బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతి, రైతు పక్షపాతి సీఎం జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో ఎన్నడూలేనివిధంగా 18 వేల ఇళ్లు మంజూరు చేశామనాన్రు. మరో 8 వేల ఇళ్లకు అనుమతి పొంది, అర్హులందరికీ ఇళ్లు ఇప్పించేవిధంగా చర్యలు చేపట్టామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పరిటాల కుటుంబం మంత్రులు, ఎంఎల్ఏలుగా పదవులు అనుభవిస్తూ ప్రజలకు చేసిందేమీలేదన్నారు. దోచుకొని దాచుకోవడమే పనిగా పెట్టుకున్నారన్నారు. స్కిల్‌డెవలప్‌మెంట్ స్కామ్‌లో రూ.370 కోట్లతో ప్రజాధనాన్ని దోచుకొని, దొరికిన చంద్రబాబు జైలుకు వెళ్తే సునీత రాద్ధాంతం చేస్తోందన్నారు. పరిటాల రవీంద్ర జైలులో ఉన్నప్పుడు ఏనాడూ ధర్నా చేయలేదన్నారు. నాలుగేళ్లలో పూరూరు డ్యాంకు హంద్రీనీవా ద్వారా నీటితో నింపామన్నారు. ముత్యాలమ్మ ఆలయాన్ని దేవదాయశాఖ పరిధిలోకి తీసుకొచ్చి, త్వరలోనే రామగిరి బంగారు గనులు తెరిపించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు.

సునీత మాటలు నమ్మే పరిస్థితి లేదు..

మహానటి పరిటాల సునీత మాయ మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలేదని, ఒక్కసారిగా అధికారం పోతానే దిక్కుతోచని స్థితిలో గ్రామాల్లోకి వెళ్లి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని ఎమ్మెల్యే అన్నారు. రాబోవు ఎన్నికల్లో ప్రజలు మరోసారి వైఎస్సార్‌సీపీకే పట్టం కడతారన్నారు. ముందుగా పాపిరెడ్డిపల్లిలో అనారోగ్యంతో మృతిచెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అంకాల్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంతకు ముందు రామగిరిలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మీనుగ నాగరాజు, కన్వీనర్ కక్రాహనుమంతరెడ్డి, తహసీల్దార్ నారాయణ స్వామి, ఎంపీడీఓ ఫజిల్‌బాషా, సీఐ చిన్నగౌస్, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సీఎంను కలిసిన పాస్టర్స్ ప్రతినిధులు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాగరాజు

రాప్తాడురూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు రెడ్డివారి నెహమ్యా నాగరాజు, అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు బైబిల్‌మిషన్ ఏఓ బందలరాజు శుక్రవారం కలిశారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొని, ముఖ్యమంత్రితో వివిధ అంశాలపై చర్చించారు. జిల్లాకు సబంధించి వివిధ అంశాలను నాగరాజు, బందల రాజు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

ఆరోగ్య సురక్ష బృహత్తర కార్యక్రమం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి వైద్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

అనంతపురం మెడికల్: అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ఓ బృహత్తర కార్యక్రమం అని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటా సర్వే చేసి, ఆరోగ్య పరీక్షలు చేసి, రోగాలతో బాధపడుతున్న వారిని గుర్తించారు. 16వ డివిజన్‌లో ఉన్న ఎమ్మెల్యే నివాసానికి ఆరోగ్యశాఖ సిబ్బంది వెళ్లారు. ఎమ్మెల్యే ‘అనంత’కు బీపీ, షుగర్ టెస్టులు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేపట్టాలన్నారు. దీర్ఘకాలిక సమస్యలతో ఎవరైనా బాధపడుతుంటే వారిని ఆరోగ్య సురక్ష క్యాంపులకు తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. శిబిరాల్లో స్పెషలిస్టు వైద్యులందించే సేవలను ప్రజలకు వివరించాలన్నారు. ఖరీదైన వైద్యం ఉచితంగా ప్రభుత్వం అందించనున్నట్లు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ కన్వీనర్ సుకేష్, సచివాలయ సిబ్బంది రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

15లోపు దరఖాస్తు చేసుకోండి

ఆత్మకూరు: స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఈనెల 15న రైతు భరోసాకోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఓ సుచరిత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

బ్రిడ్జి పనులను వేగవంతం చేయాలి



అశోక్‌నగర్‌లో బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: కాలువ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మేయర్ వసీం అధికారులను ఆదేశించారు. శుక్రవారం 22వ డివిజన్ సంగమేశ్‌నగర్, 29వ డివిజన్ అంబేద్కర్ నగర్‌లో జరుగుతున్న కాలువ నిర్మాణ పనులపై మేయర్ ఆరా తీశారు. అనంతరం అమృత్ స్కీం కింద అశోక్‌నగర్‌లో జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులను మేయర్ పరిశీలించారు. డిప్యూటీ మేయర్లు కోగటం విజయ భాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, ఎస్ఈ నాగమోహన్, ఈఈ సూర్యనారాయణ, డీఈ సుభాష్, కార్పొరేటర్లు లీలావతి, అనిల్‌కుమార్ రెడ్డి, సైపుల్లాబేగ్, తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలిస్తే కేసులు

అనంతపురం సెంట్రల్: మైనర్లకు వాహనాలిస్తే వారి తల్లిదండ్రులపైనా కేసులు నమోదు చేస్తామని రవాణాశాఖ ఏఎంవీఐ కేవీఎల్ఎన్ ప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక జేఎన్‌టీయూ రోడ్డులో వాహనాలు తనిఖీ చేశారు. చాలా మంది మైనర్ విద్యార్థులు ద్విచక్ర వాహనాలతో కళాశాలలకు వెళ్లడాన్ని ఏఎంవీఐ గమనించారు. దాదాపు 25 మందిని ఆపి కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. వాహనాలు ఇచ్చే సమయంలో తల్లిదండ్రులు కూడా ఆలోచించాలని కోరారు. పలువురు వాహనదారులకు జరిమానా వేశారు.

పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శం

ఆత్మకూరు: ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శమని ఎంపీపీ హేమలత తెలిపారు. శుక్రవారం ఆత్మకూరు రైతు భరోసా కేంద్రంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎన్నో పథకాలు అందుతున్నాయన్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. అనంతరం హార్టికల్చర్ డీడీహెచ్ రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుచరిత, హార్టికల్చర్ అధికారి రత్నాకర్, మండల కన్వీనర్ లక్ష్మీ నరసింహులు, వడ్డుపల్లి సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, ఏఈఓ సుజిత తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని ప్రజలకు తెలియజేద్దాం



మాట్లాడుతున్న జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ వడ్డుపల్లి నరసింహారెడ్డి

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేద్దామని జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ వడ్డుపల్లి నరసింహారెడ్డి తెలియజేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీపీ చాంబర్‌తో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి వైఎస్సార్‌సీపీ అనుబంధం కమిటీలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల ఇన్సూరెన్స్‌కు సంబంధించి రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, మండల కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, సర్పంచ్‌లు లక్ష్మీనారాయణరెడ్డి, ఓబులేష్ నాయకలు అంజినప్ప,ఆంజనేయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక





రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైన ముట్టాల, సనప విద్యార్థినులు

ఆత్మకూరు: మండలంలోని ముట్టాల, సనప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పీడీలు జగదీశ్వరరెడ్డి, నాగరాజు శుక్రవారం తెలిపారు. ఈనెల 11న జిల్లా కేంద్రంలో జరిగిన పరుగుపందెంలో వర్షిత ప్రథమ స్థానంలో నిలిచింది.అండర్ -14 ఈత పోటీల్లో జోత్స్న, అండర్ -17 విభాగంలో వాణి ప్రతిభ కనబరిచారు. కార్యక్రమంలో సనప హెచ్ఎమ్ సుధ, ముట్టాల హెచ్ఎమ్ లక్ష్మీనారాయణ, తదితర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఉద్యోగులను వేధిస్తే ఉద్యమిస్తాం



వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు

అనంతపురం సెంట్రల్: ఏపీఎస్ ఆర్టీసీలో ఉద్యోగులను వేధిస్తే ఉద్యమిస్తామని వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ డిపో కార్యదర్శి సోమశేఖర్, వర్కింగ్ ప్రెసిండెంట్ మాదవయ్య, నాయకులు సుందర్‌రాజు హెచ్చరించారు. శుక్రవారం అసిస్టెంట్ మేనేజర్ చంద్రశేఖరరెడ్డికి వినతిపత్రం అందించారు. నాయకులు మాట్లాడుతూ నార్పల రూట్‌లో 12 సింగిల్స్ తిప్పుతూ 12 గంటలు డ్యూటీ చేయించుకుంటున్నారని మండిపడ్డారు. 2022 ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించి 45 రోజులు ఓటీలు ఇవ్వాలన్నారు. జిల్లా వ్యాప్తంగా డిపోలలో చార్ట్ వేస్తున్నా అనంతపురం డిపోలో మాత్రం వేయలేదన్నారు.

ఈ-వ్యర్థాలను తిరిగి వినియోగించాలి



కార్యక్రమంలో పాల్గొన్న రెక్టార్ విజయకుమార్, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి

అనంతపురం: ఈ -వ్యర్థాలు (కంప్యూటర్స్, సెల్‌ఫోన్ల వ్యర్థాలు) తిరిగి వినియోగించే వ్యవస్థ రావాలని జేఎన్‌టీయూ అనంతపురం రెక్టార్ ప్రొఫెసర్ విజయకుమార్ అన్నారు. శుక్రవారం జేఎన్‌టీయూ అనంతపురంలో ఎన్ఎస్ఎస్, సుబ్రమణ్యం చారిటబుల్ ట్రస్ట్, రైజ్ యువర్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘ఈ-వేస్టేజ్ మేనేజ్‌మెంట్’ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. రెక్టార్ మాట్లాడుతూ ఈ- వ్యర్థాలను తిరిగి వినియోగించే వ్యవస్థతో నూతన వాణిజ్యం, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. గౌరవ అతిథి డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఈ వ్యర్థాల వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా డాక్టర్ శారద వ్యవహరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అరుణ కాంతి, అనంతపురం నగర డిప్యూటీ కమిషనర్ జి. రమణారెడ్డి, గ్రీన్ ఆర్మీ ప్రెసిడెంట్ అనిల్, ఎస్ఈసీటీ డైరెక్టర్ మహేష్ బాబు, పాలకమండలి సభ్యుడు డాక్టర్ రామశేఖర్ రెడ్డి, అజిత పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుడు మస్తాన్ మృతి

అనంతపురం కల్చరల్: సీనియర్ రంగస్థల నటుడు, లలితకళా పరిషత్తు కార్యనిర్వాహక మాజీ సభ్యుడు మస్తాన్ (70) శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఆర్ట్స్ కో (రవాణా కళానిలయం) కీలక సభ్యుడిగా నటనా ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన.. ఎన్నో అజరామర నాటకాలతో విభిన్న పాత్రలతో అనంతవాసులను అలరించారు. తన గురువు పులమతి బాలచందర్ పర్యవేక్షణలో ఆయన అల్లూరి సీతారామరాజు, క్షీరసాగర మథనం, చిచ్చు, చెదలు, బేతాళ ప్రశ్న, మార్పు, రైతంటే నాటకాలు ఆయనకు కీర్తిని తెచ్చిపెట్టాయి. నంది నాటకోత్సవాలకు ఆయన న్యాయనిర్ణేతగా అనేకసార్లు వ్యవహరించారు. అనేక నాటకాలకు దర్శకత్వం వహించారు. జనప్రియ కవి ఏలూరు యంగన్న, దశాబ్దాలుగా ఆయనతో కలిసి నటించిన సీనియర్ నటులు రాము, రమేష్, చెన్నారెడ్డి, నాట్యాచార్యులు పట్నం శివప్రసాద్ ఆయనకు నివాళులర్పించారు. మస్తాన్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

చంద్రశేఖరేంద్రపీఠంలో దసరా ఉత్సవాలు

అనంతపురం కల్చరల్: చంద్రశేఖరేంద్ర సరస్వతి జ్ఞాన పీఠం ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు మధుసూదన శర్మ శుక్రవారం తెలిపారు. 15 నుంచి 24 వరకు ప్రతిరోజూ చండీ పారాయణాలు, హో మాలు, శమీ పూజలు, గ్రామోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. కుంకుమార్చనలో పాల్గొనేవారు సెల్: 8142558444లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

దసరా ఉత్సవాల పోస్టర్ల విడుదల

అనంతపురం కల్చరల్: నగరంలోని అర్బన్ బ్యాంకు ముందు తొలిసారి జరుగనున్న దసరా వేడుకల పోస్టర్లు, బుక్‌లెట్లను శుక్రవారం ఆవిష్కరించారు. బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్, సీఈవో తదితరులు మాట్లాడారు. ఈనెల 15 నుంచి 23 వరకు జరిగే ఉత్సవాలను తొలిరోజు కలెక్టర్ గౌతమి ప్రారంభిస్తారన్నారు. ఎస్పీ అన్బురాజన్, జిల్లా కోఆపరేటివ్ అధి కారి ప్రభాకరరెడ్డి, రిజిస్ట్రార్ భార్గవతో పాటు ఇతర అధికారులు ప్రత్యేక పూజల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో వైఎస్ చైర్మన్ కృష్ణకుమార్, డైరెక్టర్లు సుంకర రమేష్, బాషా, సుబ్రమణ్యం, భాస్కర్ పాల్గొన్నారు.

నగరంలోని హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయాన్ని దసరా ఉత్సవాలకు సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయ ధర్మకర్త, కార్పొరేటర్ గురుశేఖర్‌బాబు మాట్లాడుతూ నిత్యం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తారన్నారు.

రేపు ‘ఊరి నెర్లు’ పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్: కవి కైలాస్‌నాథ్ రచించిన ‘ఊరినెర్లు’ పుస్తకాన్ని విమలాశాంతి సాహిత్య సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించనున్నట్లు సీనియర్ రచయిత డాక్టర్ శాంతినారాయణ తెలిపారు. స్థానిక ఎన్జీవో హోమ్‌లో ఉదయం 10.30 గంటలకు కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు డాక్టర్ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, బండి నారాయణస్వామి చేతుల మీదుగా ఆవిష్కరణ ఉంటుందన్నారు.

అడల్ట్ ఎడ్యుకేషన్ విభాగాన్ని కొనసాగించాలి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో అడల్ట్ ఎడ్యుకేషన్ విభాగాన్ని కొనసాగించేంతవరకు ఆందోళనలు చేస్తామని విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు పేర్కొన్నారు. ఎస్కేయూ ప్రధాన ద్వారం వద్ద జేఏసీ నాయకులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష రెండో రోజుకు చేరుకుంది. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ స్వామి దీక్షకు సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన, డాక్టర్ అంకన్న, డాక్టర్ ప్రతాప్, డాక్టర్ కల్పప్ప, ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష , కార్యదర్శులు రమణయ్య, కుళ్లాయిస్వామి , ఎస్ఎఫ్ఐ కార్యదర్శి పరమేష్, మంజునాథ, విశ్వ పాల్గొన్నారు.

రామాయణం ఆదర్శ గ్రంథం

అనంతపురం కల్చరల్: రామాయణాన్ని చదవడం, వినడం ఎంతో సుకృతమని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. స్థానిక అశోక్‌నగర్‌లోని రమా సమేత సత్యనారాయణస్వామి ఆలయంలో సాయి ట్రస్టు ఆధ్వర్యంలో రామాయణ సప్తాహం శుక్రవారం రాత్రి ఘనంగా ముగిసింది. కార్యక్రమంలో అంబటి ఫణిరాజ్, రవీంద్ర, నారాయణ, వెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



ఆరోగ్య సురక్ష కిట్ అందిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లిలో ఆరోగ్యసురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి భ్రమరాంబికాదేవి

చెన్నేకొత్తపల్లి: ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా ఇస్తోందని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ప్యాదింటి గ్రామంలో సర్పంచు యర్రమ్మ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం పెద్ద ఎత్తున జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఆస్పత్రులు వివిధ రకాల రోగాలతో బాధపడేవారితో కిటికిటలాడేవన్నారు. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వం గ్రామాల్లోని ప్రజలు చెంతకే జగనన్న సురక్ష కార్యక్రమాల ద్వారా అన్నిరకాల వైద్య సేవలను అందిస్తోందన్నారు. స్థానిక ఎన్ఎస్‌గేట్ పీహెచ్‌సీ వైద్యులు ఉదయ్, రవినాయక్ వైద్య సేవలు అందించారు. చెన్నేకొత్తపల్లి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార ప్రదర్శన నిర్వహించారు. వైద్య శిబిరానికి హాజరైన ప్రజలకు మాజీ వైస్ ఎంపీపీ గాయత్రి, నరసింహారెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవింద రెడ్డి, తహసీల్దార్ షాబుద్దీన్, ఎంపీడీఓ గంగావతి, సింగిల్ విండో అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ఈఓఆర్డీ అశోక్ నాయక్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నర్శిరెడ్డి, నాయకులు, సానే రాజారెడ్డి, మేడాపురం సూరి తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు: ప్రజారోగ్యానికి ప్రభుత్వం భరోసా ఇస్తోందని జిల్లా వైద్యాధికారి భ్రమరాంబికాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని ప్రసన్నాయపల్లిలో వినాయకుమార్ ఎయిడెడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి ప్రారంభించారు. ఐసీడీఎస్ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్ సందర్శించారు. దాదాపుగా 405 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 48 మందిని శస్త్ర చికిత్సల కోసం అనంతపురానికి రెఫర్ చేసినట్లు వైద్యాధికారి శ్రావణి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్, ఈఓఆర్డీ నరసింహారెడ్డి, సర్పంచు శశికళ, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు వెన్నపూస లోకేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యాలేరులో కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

361 మందికి వైద్య పరీక్షలు

ఆత్మకూరు: మండలంలోని పి.యాలేరులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం శుక్రవారం నిర్వహించారు. సిద్ధరాంపురం, వై.కొత్తపల్లి, పి.యాలేరు గ్రామాల నుంచి మొత్తం 361 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అందులో 18 మందిని శస్త్రచికిత్సలకు రెఫర్ చేసినట్లు డాక్టర్ నబిహా సుల్తానా తెలిపారు. అనంతరం కంటి పరీక్షలు చేసి, కళ్లద్దాలు అందించారు. హార్టికల్చర్ డీడీహెచ్ (మండల ప్రత్యేకాధికారి) రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ షర్మిల, ఎంపీడీఓ రఘునాథ్ ఎంపీపీ హేమలత, సర్పంచ్ ఆరోగ్యంరెడ్డి, వైస్ ఎంపీపీలు నీలిమ, విజయ్ , వడ్డుపల్లి సర్పంచ్ లక్ష్మీ నారాయణ రెడ్డి, మండల కన్వీనర్ లక్ష్మీనరసింహ, మండల బీసీ సెల్ అధ్యక్షుడు బాలపోతన్న, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ వడ్డుపల్లి నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఫణిరెడ్డి, అతిక్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, బాలస్వామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.